సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 30 । మే । 2024



మద్దిలో జయంత్యుత్సవాలు

గురవాయిగూడెంలోని మద్ది ఆంజనేయ స్వామి క్షేత్రంలో ఈ నెల 31 నుంచి జూన్ 4వ తేదీ వరకు హనుమద్ జయంత్యుత్సవాలను నిర్వహించనున్నారు. 8లో ▸



జాతీయ నాటిక పోటీలు

భీమవరంలో చైతన్యభారతి సంగీత నృత్య నాటక పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి జాతీయ స్థాయి నాటిక పోటీలు నిర్వహించనున్నారు. 8లో ▸



సీహెచ్‌సీలో అరుదైన శస్త్రచికిత్స

బుట్టాయగూడెం సీహెచ్‌సీలో వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. ఓ గిరిజనుడికి దవడ కింది భాగంలో ఏర్పడిన కణితిని శస్త్ర చికిత్స చేసి తొలగించారు. 8లో ▸

న్యూస్‌రీల్

రావిపాడు ఘటనలో బాధితులకు న్యాయం చేస్తాం

తాడేపల్లిగూడెం: రావిపాడు**లో సైనికోద్యోగి** కుటుంబానికి కేటాయించిన **స్థలం వాస్తవిక**తపై అధికారులతో మాట్లాడి **తగిన న్యాయం** చేస్తామని కలెక్టర్ సుమిత్‌కు**మార్ చెప్పారు.** రావిపాడు ఘటనకు సంబంధించి న్యాయం చేయాలని కోరుతూ బాధితులు బుధవారం కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. ఈ స్థలంలో నిర్మాణం విషయంలో సైనికోద్యోగి భార్యపై దాడి చేయడంతో వివాదం చెలరేగడం, అంబేడ్కర్ విగ్రహం తరలింపు సమయంలో ఒక వర్గం రాళ్లతో దాడి ఘటనలపై ఇరు వర్గాలపై కేసులు నమోదయ్యాయన్నారు. అయితే ఉద్రిక్తతలను ప్రేరేపించేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం, కథనాలను ప్రసారం చేయడం, రాయడం వంటివి చర్యలను తీవ్రంగా పరిగణిస్తామన్నారు. విచారణ అనంతరం తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బాధితులకు హామీ ఇచ్చారు.

70 మందిపై కేసు : డీఎస్పీ మూర్తి

తాడేపల్లిగూడెం: రావిపాడులో సైనికోద్యోగి కుటుంబానికి కేటాయించిన స్థలం విషయంలో తలెత్తిన వివాదంలో పోలీసులపై రాళ్లతో దాడులు, ఇతర ఘటనలకు సంబంధించి 70 మందిపై నాలుగు కేసులు నమోదు చేసినట్టు తాడేపల్లిగూడెం డీఎస్పీ మూర్తి బుధవారం విలేకరులకు చెప్పారు. సైనికోద్యోగి పలివెల నాగేశ్వరరావుకు కేటాయించిన స్థలంలో ఇంటి నిర్మాణం చేస్తుండగా, ఏసుబాబు కాలనీకి చెందిన ఎస్సీ వర్గీయులు నిర్మాణంలో ఉన్న ఇంటి వద్ద అంబేడ్కర్ విగ్రహం పెట్టే క్రమంలో గొడవ జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో సైనికోద్యోగి భార్య విజయలక్ష్మి తనపై కొందరు దాడిచేసి వివస్త్రను చేసే ప్రయత్నం చేశారనే ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు. ఏసుబాబు కాలనీకి చెందిన కొందరు విజయలక్ష్మి తమను కులం పేరుతో దూషించి అవమానించారని ఇచ్చిన ఫిర్యాదుపై మరో కేసు నమోదు చేశామన్నారు. శాంతిభద్రతలను అదుపు చేసే క్రమంలో కొందరు పోలీసులపై రాళ్ల దాడి చేయడంతో ఒక ఎస్సైతో పాటు, నలుగురు కానిస్టేబుళ్లు గాయపడ్డారన్నారు. గ్రామంలో ఈ నెలాఖరువరకు 144 సెక్షన్, 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుందన్నారు. రూరల్ సీఐ ఏ.రమేష్, పెంటపాడు ఎస్‌ఐ సమావేశంలో పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష

భీమవరం: జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. మొదటి సంవత్సరం జనరల్ పరీక్షకు 6,294 మందికి 5,820, ఒకేషనల్ పరీక్షకు 391 మందికి 346 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆర్‌ఐవో కె.చంద్రశేఖర్‌బాబు చెప్పారు. ద్వితీయ సంవత్సరం జనరల్ పరీక్షకు 1,684 మందికి 1,539, ఒకేషనల్ పరీక్షకు 147 మందికి 136 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షకు 61 శాతం హాజరు

జిల్లాలో బుధవారం నిర్వహించిన టెన్త్ సప్లమెంటరీ పరీక్షకు 61 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ చెప్పారు. భౌతికశాస్త్ర పరీక్షకు 7,120 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 2,759 మంది గైర్హాజరయ్యారన్నారు.

బడి బస్సుకు భద్రత

వేసవి సెలవుల అనంతరం స్కూళ్లు పునఃప్రారంభం నేపథ్యంలో పశ్చిమగోదావరి జిల్లాలో బడి బస్సుల భద్రతపై రవాణా శాఖ దృష్టి సారించింది. నిబంధనల మేరకు వాటి సామర్థ్యాన్ని పరీక్షించేందుకు చర్యలు చేపట్టింది. కండీషన్‌లో ఉన్న వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ)లు జారీ చేస్తోంది. జిల్లాలో 1,327 స్కూల్ బస్సులు ఉండగా, ఇప్పటికే 555 బస్సులకు రవాణా శాఖ అధికారులు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా పాఠశాలలు తెరిచేనాటికి మిగిలిన వాటినీ పరీక్షించేందుకు కసరత్తు చేస్తున్నారు.

- ముగిసిన పాత ఫిట్‌నెస్ సర్టిఫికెట్ గడువు
- మొదలైన కొత్త ఎఫ్‌సీల జారీ ప్రక్రియ
- జూన్ 12లోగా పూర్తికి రవాణా శాఖ కసరత్తు
- జిల్లాలో 463 ప్రైవేట్ విద్యా సంస్థల పరిధిలో మొత్తం 1,327 స్కూల్ బస్సులు
- ఇప్పటికే 555 వాహనాలకు ఫిట్‌నెట్ పరీక్షలు పూర్తి
- విద్యార్థుల భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత



భీమవరంలో స్కూల్ బస్సు తనిఖీ చేస్తున్న మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ

సాక్షి, భీమవరం: జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థలు 463 ఉన్నాయి. విద్యార్థుల రవాణ కోసం ఆయా విద్యాసంస్థలు బస్సులనే అధికంగా వినియోగిస్తున్నాయి. బస్సు కండీషన్‌లో లేకపోతే విద్యార్థుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంటుంది. వారి భద్రత కోసం విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందు ఏటా రవాణా శాఖ స్కూల్ బస్సుల సామర్థ్యాన్ని పరీక్షించి నిబంధనల మేరకు కండీషన్‌లో ఉన్న వాహనాలకు మాత్రమే ఎఫ్‌సీ జారీ చేస్తుంది. ప్రభుత్వ నిబంధనలు మేరకు ప్రతి స్కూల్ బస్సుకూ ఎఫ్‌సీ తప్పనిసరి. లేనివాటిని గుర్తించి సీజ్ చేయాల్సిన బాధ్యత రవాణశాఖ అధికారులపై ఉంది.

నిర్ణీత తేదీల్లో పరీక్షలు

గత ఏడాది జారీ చేసిన ఎఫ్‌సీ గడువు ఈనెల 15వ తేదీతో ముగియడంతో రానున్న విద్యాసంవత్సరానికిగాను 17వ తేదీ నుంచి బస్సుల ఫిట్‌నెస్‌ను తేల్చే పనిలో జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెంలోని మోటార్ వెహికల్ తనిఖీ అధికారులు నిమగ్నమయ్యారు. బస్సులకు ఎఫ్‌సీల జారీ కోసం పాటించాల్సిన నిబంధనలపై ఇప్పటికే పాఠశాల, కళాశాలల యాజమాన్యాలకు తెలియజేశారు. ఆన్‌లైన్‌లో బస్సుల వివరాలను నమోదు చేయించి నిర్ణీత తేదీ వాటికి సంబంధిత రవాణా శాఖ కార్యాలయాల వద్ద ఫిట్‌నెస్ పరీక్షలు చేస్తున్నారు.

తల్లిదండ్రులూ గమనించాలి

బస్సులోని ఫస్ట్‌ఎయిడ్ బాక్స్‌ను నెలకోసారి పేరెంట్స్ కమిటీ పరిశీలించాలి. దీనికోసం ప్రత్యేక రిజిస్టర్‌ను నిర్వహించాలి. సీటింగ్ కెపాసిటీకి మించి విద్యార్థులను ఎక్కించరాదు. ప్రతి నెలా బస్సు కండిషన్‌ను యాజమాన్యాలు, పాఠశాల పేరెంట్స్ కమిటీ తనిఖీ చేయాలి. బస్సులో ఫిర్యాదుల పుస్తకం ఉంచి ప్రతి నెలా యాజమాన్యం తనిఖీ చేసి ఫిర్యాదులను పరిశీలించాలి. రవాణా, పోలీస్, విద్యాశాఖల సహకారంతో ప్రతి విద్యా సంస్థ ఏడాదిలో ఒక రోజు విద్యార్థులకు రోడ్ సేఫ్టీ తరగతులు నిర్వహించాలి. పాఠశాల వద్ద బస్సుల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం ఉండాలి.

ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేస్తాం



ప్రతి స్కూల్ బస్సుకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి. జిల్లాలో 1,327 స్కూల్ బస్సులు ఉండగా ఇప్పటికి 555 బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయ్యాయి. స్కూల్స్ తెరిచేలోగా మిగిలిన వాటికి పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థుల భద్రత దృష్ట్యా స్కూల్స్ తెరిచాక ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఎఫ్‌సీ లేని బస్సులను సీజ్ చేస్తాం.

– ఉమామహేశ్వరరావు, జిల్లా రవాణా శాఖ అధికారి, భీమవరం

జిల్లాలో స్కూలు బస్సుల వివరాలు

రవాణా శాఖ కార్యాలయం	మొత్తం బస్సులు	ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయినవి
భీమవరం	528	224
పాలకొల్లు	288	80
తణుకు	193	73
తాడపల్లిగూడెం	318	178

ఈ నిబంధనలు తప్పనిసరి

- బస్సు డ్రైవర్‌కు 60 ఏళ్ల లోపు వయస్సు ఉండి ఐదేళ్ల అనుభవం కలిగి ఉండాలి. బీపీ, షుగర్, కంటి సంబంధిత సమస్యలు లేవని మెడికల్ సర్టిఫికేట్ సమర్పించాలి. ఈ సర్టిఫికేట్‌ను బస్సులో ఒకటి, యజమాని వద్ద ఒకటి ఉంచాలి. ప్రతి బస్సుకూ అటెండర్ తప్పనిసరి
- స్కూల్ బస్సుల వేగం గంటకు 60 కిలోమీటర్లు మాత్రమే ఉండేలా స్పీడ్ గవర్నర్స్ తప్పనిసరి
- బ్రేక్, హ్యాండ్ బ్రేక్, స్టీరింగ్, టైర్లు, స్పీడోమీటర్ అన్నీ కండీషన్‌లో ఉండాలి.
- బస్సుకు సంబంధించిన అన్ని లైట్లు పనిచేయాలి
- రిఫ్లక్టివ్ టేపును బస్సుకు నాలుగు వైపులా అతికించాలి
- బస్సుకు ఉన్న గ్లాసులు అన్ని పటిష్టంగా ఉండాలి
- బస్సు నుంచి అధిక మొత్తంలో బ్లాక్ స్మోక్ (పొగ) రాకుండా చూడాలి
- బస్సుకు అత్యవసర ద్వారం, మంటలను ఆర్పే పరికరం, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఉండాలి
- సైడ్ విండోలకు మధ్యలో మూడు అంగుళాలకు మించని దూరంలో అడ్డంగా మూడు లోహపు కడ్డీలు అమర్చి ఉండాలి. ఫుట్ బోర్డుపై మొదటి మెట్టు భూమి నుంచి 325 మి.మీ ఎత్తుకు మించరాదు. మెట్లు జారకుండా లోహంతో అమర్చబడి ఉండాలి. బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు పట్టుకునేందుకు వీలుగా బస్సు ముందరి తలుపు మెట్లకు సమాంతరంగా రైలింగ్‌లు ఏర్పాటు చేయాలి
- బస్సు ఎడమవైపు ముందు భాగంలో యాజమాన్యం వివరాలు, స్కూల్ బాయ్ అండ్ గర్ల్ ఇమేజ్ పొందుపర్చాలి
- బస్సు బయలుదేరే సమయం, ఆగే స్థలాలు రూట్ ప్లాన్, విద్యార్థుల సంఖ్య, వారి పూర్తి వివరాలు, డ్రైవర్ వివరాలు బస్సులో ఉంచాలి.

ఉపాధి పనుల్లో లోపాలుంటే చర్యలు

కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

భీమవరం (ప్రకాశం చౌక్): జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న పనుల్లో లోపాలుంటే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ హెచ్చరించారు. ఉపాధి హామీ పథకం అమలు తీరుపై కలెక్టరేట్‌లోని వశిష్ట కాన్ఫరెన్స్ హాలులో బుధవారం సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా పథకంలో నిర్వహిస్తున్న పనులు, ఫీల్డ్, ఫీడర్ చానల్స్, చెరువులలో పూడిక తొలగింపు, హౌసింగ్ 90 దినాలు, తదితర పనులపై డ్వామా పీడీ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలు, ఏపీవోలతో మండలాలు వారీగా జరుగుతున్న పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎం-బుక్, తదితర రికార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేసి, సమర్థవంతంగా పనులను నిర్వహించాలన్నారు. అర్హత కలిగిన వారికి ఉపాధి హామీ పనులను కల్పించడమే కాక వారికి సకాలంలో నగదు చెల్లించాలన్నారు. పని ప్రదేశాలలో కూలీలు వడ దెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచి, పనుల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలన్నారు. త్వరలో పనులను తనిఖీ చేస్తానని, పనులలో లోటుపాట్లు కనపడితే సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని సుమిత్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఎం.ప్రభాకరరావు, జిల్లాలోని టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలు, ఏపీవోలు పాల్గొన్నారు.

పారిజాతగిరిలో వైభవంగా ధ్వజారోహణం



పారిజాతగిరిలో ధ్వజారోహణ కార్యక్రమ విశిష్టతను వివరిస్తున్న ఆలయ అర్చకుడు నల్లూరి రవికుమారాచార్యులు



శేషవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు



శ్రీదేవి, భూదేవి, శ్రీనివాసుని ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు రెండో రోజు ఘనంగా జరిగాయి. ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం యాగశాలలో హోమ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ధ్వజపటంను ఆలయం చుట్టూ ప్రదక్షిణ గావించి ధ్వజస్తంభం వద్ద శ్రీదేవి, భూదేవి ,శ్రీనివాసుడి ఉత్సవమూర్తులు, సుదర్శన్ పెరుమాళ్‌ను వేదికపై ఉంచి ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద ధ్వజపటంకు ప్రత్యేక గరుడ ప్రసాదం నివేదన చేసి సంతానం కోరుతూ వచ్చిన సుమారు 30 మంది దంపతులకు ఈ గరుడ ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమాలలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. బుధవారం శేష వాహనంపై స్వామి వారికి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఉభయదారులుగా పేరిచర్ల జగపతిరాజు దంపతులు, బాల భాస్కర్ దంపతులు, హనుమంత రామ నాగబాబు దంపతులు పాల్గొన్నారు. ఉభయదారులకు స్వామివారి ఆశీస్సులు అందజేసి తీర్థ ప్రసాదాలు శేష వస్త్రాలు అందజేశారు. కార్యక్రమ ఏర్పాట్లు కార్యనిర్వాహణాధికారి మానికల రాంబాబు పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రతిరోజు సాయంత్రం ఉచిత బస్సు సర్వీసును ఏర్పాటుచేసినట్లు ఈవో తెలిపారు.

నేటి కార్యక్రమాలు : బ్రహ్మోత్సవాల్లో భాగంగా గోకుల తిరుమల పారిజాతగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఉదయం నిత్యహోమం, నీరాజనం, తీర్థప్రసాద గోష్టి జరుగుతాయి. సాయంత్రం స్వామి వారికి హనుమంత వాహన సేవ నిర్వహిస్తారు.

కౌంటింగ్ నిర్వహణకు పకడ్బందీగా చర్యలు




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

భీమవరం (ప్రకాశంచౌక్): సార్వత్రిక ఎన్నికల్లో జూన్ 4వ తేదీన చేపట్టే కౌంటింగ్ నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ చెప్పారు. జిల్లాలో కౌంటింగ్ సన్నద్ధతపై బుధవారం న్యూఢిల్లీలోని నిర్వచన్ సదన్ నుంచి సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, ఎస్పీ అజిత వేజెండ్ల, జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య, డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, నియోజకవర్గ ఆర్వోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టే కౌంటింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేశామన్నారు. ఇప్పటికే రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు, ఏజెంట్లకు కౌంటింగ్‌లో పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించామన్నారు. కౌంటింగ్ ఏర్పాట్లకు సంబంధించి ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నామని, ఉదయం ఎనిమిది గంటలకి పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభించి రెండు రౌండ్లలో పూర్తి చేస్తామన్నారు. ఎస్పీ అజిత వేజెండ్ల మాట్లాడుతూ జిల్లాలో రెండు చోట్ల కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు కిలోమీటరు పరిధిలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తామన్నారు. జిల్లాలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని, ఇక్కడ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

ఆహ్లాదం.. పాపికొండల విహారం

- పాపికొండలకు పెరుగుతున్న పర్యాటకుల తాకిడి
- యాత్రికుల కోసం అందుబాటులోకి అనేక సౌకర్యాలు



పాపికొండల నడుమ గోదావరిలో ప్రయాణిస్తున్న లాంచీలు



లాంచీలో పేరంటాలపల్లి చేరుకున్న పర్యాటకులు



గోదావరి నదిపై పాపికొండల యాత్రకు లాంచీలో వెళుతున్న పర్యాటకులు



పేరంటాలపల్లిలో కళాకృతులను కొనుగోలు చేస్తున్న పర్యాటకులు పర్యాటకులు

బుట్టాయగూడెం: పాపికొండల మధ్య గోదావరిపై లాంచీ ప్రయాణం అద్భుతమైన అనుభూతి. వేసవిలో లాంచీలపై ప్రయాణం ఎంతో ఆనందాన్ని పంచుతుంది. ప్రస్తుతం పాపికొండలకు పర్యాటకుల తాకిడి రోజురోజుకూ పెరుగుతుంది. ప్రతీ ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు సందడి చేస్తుండగా ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో పర్యాటకులు పాపికొండల ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు. గత రెండు రోజులుగా పాపికొండలకు విహారయాత్రికుల తాకిడి ఎక్కువగా ఉందని అధికారులు చెబుతున్నారు. అల్లూరి జిల్లా గండిపోచమ్మ గుడి దగ్గర నుంచి పేరంటాలపల్లి వరకూ లాంచీల్లో ప్రయాణం చేస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ పర్యాటకులు ఆనందంగా గడుపుతున్నారు. ఈ విహారయాత్రకు విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, భద్రాచలం, జంగారెడ్డిగూడెం, తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారు.

సందర్శన స్థలాలు :

పాపికొండల విహారయాత్రలో భాగంగా పలు సందర్శన స్థలాలను చూడవచ్చు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని దేవీపట్నం మండలంలోని గండిపోచమ్మగుడి, బ్రిటిష్ కాలపు పోలీస్ స్టేషన్, 11వ శతాబ్దం నాటి ఉమాచోడేశ్వర స్వామి ఆలయం, కొరుటూరులో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన కాటేజీలు, పేరంటాలపల్లి ఆశ్రమాన్ని సందర్శించి అక్కడ శివుడిని దర్శించుకోవచ్చు. గోదావరి వెంట ఇరువైపులా గట్లపై దర్శనమిచ్చే గిరిజన గ్రామాల్లోని ఇళ్ల పర్యాటకులకు కనువిందు చేస్తాయి. అదేవిధంగా పోలవరం ప్రాజెక్టు కూడా పర్యాటకుల మనసు దోచుకుంటుంది. గోదావరి నదిపై నిర్మించిన ఈ ప్రాజెక్టును తిలకించేందుకు వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు.

గిరిజనుల ఆప్యాయత, ఆదరణ

పేరంటాలపల్లి పర్యాటకులకు గిరిజనుల ఆప్యాయత, ఆదరణ ఆకట్టుకుంది. అక్కడి కొండరెడ్డి గిరిజనులు పర్యాటకులకు వెదురుతో తయారు చేసిన రకరకాల కళాకృతులను విక్రయిస్తూ జీవనం సాగిస్తుంటారు. పాపికొండల పర్యటనకు వెళ్లిన ప్రతిఒక్కరూ తప్పనిసరిగా వాటిని కొనుగోలు చేసి యాత్రకు గుర్తుగా ఇంటికి తీసుకువెళ్తుంటారు. గండిపోచమ్మ గుడి నుంచి గోదావరి అలలపై సాగే ఈ యాత్ర సుమారు 5 గంటలకు పైగా ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. పర్యాటకులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వం, అధికారులు అన్ని ఏర్పాట్లు చేయడంతో యాత్రికుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుంది.

నేడు జిల్లాకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి రాక

భీమవరం (ప్రకాశం చౌక్): రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా గురువారం భీమవరం రానున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ గాంధీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు కృష్ణా జిల్లా మచిలీపట్నం నుంచి బయలుదేరి మధ్యాహ్నం 3.30 గంటలకు భీమవరం చేరుకుంటారు. భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కాలేజీ, విష్ణు కాలేజీలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను, స్ట్రాంగ్‌రూమ్‌లను తనిఖీ చేస్తారు. సాయంత్రం 4.30 గంటలకు భీమవరం నుంచి బయలుదేరి విజయవాడ వెళతారని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో కార్మికుడి మృతి


మహాలక్ష్ముడు మృతదేహం

భీమడోలు: జాతీయ రహదారి భీమడోలు రైల్వే గేటు సమీపంలోని లింగంపాడు వంతెన వద్ద రోడ్డు దాటుతున్న సెంట్రింగ్ కార్మికుణ్ని బుధవారం సాయంత్రం ఓ ప్రైవేటు బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భీమడోలు పంచాయతీ అరుంధతీ కాలనీకి చెందిన భీమడోలు మహాలక్ష్ముడు (38) అక్కడిక్కడే మృతి చెందాడు. అరుంధతీ కాలనీకి చెందిన సెంట్రింగ్ పని చేసే మహాలక్ష్ముడు ఏలూరులోని తన తల్లి వద్దకు వెళ్లేందుకు ఇంటి నుంచి బయలుదేరాడు. లింగంపాడు వంతెన వద్ద బస్సు ఎక్కేందుకు జాతీయ రహదారి దాటుతుండగా తాడేపల్లిగూడెం నుంచి ఏలూరు వైపుగా వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో మహాలక్ష్ముడు అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మహాలక్ష్ముడు అక్క కలపాల మరియమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

ప్రయాణికుడి మృతి


బస్టాండ్‌లో మృతి చెందిన వ్యక్తి

భీమవరం: భీమవరం కొత్త బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద రీతిలో మృతి చెందాడని ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆ వ్యక్తి 17వ నెంబర్ ప్లాంట్ ఫాం వద్దకు వచ్చి అకస్మాత్తుగా కళ్లు తిరిగి పడిపోయాడని, బస్టాండ్ సిబ్బంది చూసి 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారని చెప్పారు. అంబులెన్స్ సిబ్బంది వచ్చి పరీక్షించగా అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందినట్టు నిర్ధారించినట్టు తెలిపారు. ఆ వ్యక్తికి 40 ఏళ్ల వయస్సు ఉంటుందని వివరించారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసుల సెల్ నెంబర్లు 94407 96633, 94407 96632లో తెలియజేయాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



పాలకొల్లు అర్బన్: దిగమర్రు – చించినాడ బైపాస్‌రోడ్డులో గత సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు ఎస్సై డి.హరికృష్ణ తెలిపారు. దిగమర్రు బైపాస్‌రోడ్డులో నడచుకుంటూ వెళుతున్న గుర్తు తెలియని వ్యక్తిని మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన కవురు హరికృష్ణ మోటార్ సైకిల్‌పై వెళుతూ ఢీకొట్టారు. దీంతో ఆ వ్యక్తికి తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు హుటాహుటిన పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడు వయస్సు 55 సంవత్సరాలు ఉంటుందని, నలుపు రంగు చాయతో నీలం రంగు చొక్కా ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పాలకొల్లు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉంచినట్టు ఎస్సై హరికృష్ణ తెలిపారు.

హనుమజ్జయంతి ఉత్సవాలకు సర్వం సిద్ధం

- మద్దిలో 31 నుంచి జూన్ 4 వరకు ఉత్సవాలు
- ఉమ్మడి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి రానున్న భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్: మద్ది చెట్టునే ఆలయ శిఖరంగా చేసుకుని, ఆ చెట్టు పేరునే మద్ది ఆంజనేయస్వామిగా వెలిసి దేశంలోనే గోపురం లేని ప్రముఖ హనుమద్ క్షేత్రంగా పేర్గాంచింది జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెంలోని శ్రీమద్ది ఆంజనేయ స్వామి క్షేత్రం. గర్భాలయంలో స్వామి వారి వద్దకు వెళ్లి దర్శనం చేసుకోవడం ఇక్కడ ప్రత్యేకత. పచ్చని పొలాల మధ్య, ఎర్రకాలువను ఆనుకుని మద్ది చెట్టు తొర్రలో స్వామివారు వెలిసిన స్వయంభు క్షేత్రం ఇది. 50 ఏళ్ల క్రితం చిన్న చెట్టు తొర్రలో ఉన్న ఆలయం ప్రస్తుతం ప్రముఖ ఆలయాల జాబితాలో స్థానం సంపాదించుకుంది. ఏలూరు జిల్లాలో ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రం తర్వాత రెండో స్థానంలో మద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రం. ఈ క్షేత్రంలో ఏటా హనుమజ్జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈనెల 31 నుంచి జూన్ 4వ తేదీ వరకు క్షేత్రంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. జూన్ 1న హనుమజ్జయంతి సందర్భంగా ఈ దేవస్థానంలో ఉత్సవాల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రముఖ హనుమాన్ క్షేత్రం కావడంతో అనేక జిల్లాల నుంచి భక్తులు స్వామి వారి దర్శనానికి రానున్నారు.


శ్రీమద్ది ఆంజనేయస్వామి దేవస్థానం


శ్రీమద్ది ఆంజనేయస్వామి

పూజా కార్యక్రమాలు

- ఈనెల 31న స్వామి వారి నిజరూప దర్శనం, స్వామి వారి జన్మనక్షత్రం పూర్వాభాద్ర నక్షత్రం కావడంతో సువర్చలా హనుమద్ కల్యాణం, విశ్వక్సేన పూజ, పుణ్యహవచనం, దీక్షాధారణ వంటి పూజలు నిర్వహిస్తారు.
- జూన్ 1న హనుమాన్ జయంతి సందర్భంగా స్వామి వారికి ప్రభాత సేవ, నిత్యార్చన, లక్ష తమలపాకులతో పూజలు, నీరాజన మంత్రపుష్పాలు, సాయంకాల హోమాలు, బలిహరణ, నీరాజన మంత్రపుష్పాల సమర్పణ.
- జూన్ 2న సువర్చలా హనుమద్ కల్యాణం, సాయత్రం 6 గంటలకు స్వామి వారి గ్రామోత్సవం, నిత్యహోమాలు, బలిహరణలు, నీరాజన మంత్రపుష్పాలు, ప్రసాద వితరణ.
- జూన్ 3న ఉదయం 5 గంటలకు స్వామి వారికి ప్రభాత సేవ, నిత్య అర్చన, నిత్య హోమము, ఉదయం 9 గంటలకు ఉపాలయంలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణం, సాయంత్రం సాయంకాల హోమాలు, మహాశాంతి హోమం.
- జూన్ 4న మహాపూర్ణాహుతి, ప్రభాత సేవ, స్వామి వారికి చక్రస్నానం, అభిషేకాలు, ధ్వజారోహణ, సాయంత్రం 7 గంటలకు క్షేత్రంలో ఉన్న పుష్కరిణిలో అంజన్న తెప్పోత్సవం.

ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు



మద్దిక్షేత్రంలో ఐదు రోజుల పాటు హనుమజ్జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. ప్రత్యేక పూజలు, లక్షార్చన, స్వామి వారి కల్యాణాలు వంటి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నాం. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రాన్ని సందర్శించి స్వామి వారిని దర్శించుకోవాలి

– ఆకుల కొండలరావు, ఆలయ ఈఓ

ఎలా వెళ్లాలంటే..

జిల్లా కేంద్రం ఏలూరు నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లే మార్గంలో 48 కిలో మీటర్ల దూరంలో, జంగారెడ్డిగూడెం పట్టణానికి 4 కిలోమీటర్ల ముందు గురవాయిగూడెంలో మద్ది క్షేత్రం ఉంది. తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల వారు నల్లజర్ల, కొయ్యలగూడెం మీదుగా జంగారెడ్డిగూడెం చేరుకోవచ్చు. జంగారెడ్డిగూడెం నుంచి సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రానికి చేరుకోవచ్చు. అలాగే కొవ్వూరు పరిసర ప్రాంతాల వారు దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం మీదుగా జంగారెడ్డిగూడెం చేరుకుని అక్కడ నుంచి గురవాయిగూడెం వెళ్లవచ్చు. తెలంగాణకు చెందిన వారు అశ్వారావుపేట, జీలుగుమిల్లి మీదుగా జంగారెడ్డిగూడెం చేరుకుని ఇక్కడ నుంచి గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి దేవస్థానానికి చేరుకోవచ్చు.

దర్శన వేళలు

- నిత్యం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7.30 గంటల వరకు.
- ప్రతి మంగళవారం వేకువ జాము 5.30 గంటల నుంచి స్వామి వారి దర్శనం లభిస్తుంది.

నేటి నుంచి జాతీయ స్థాయి నాటిక పోటీలు


నాటిక పోటీలకు వేదిక


కళావేదిక వద్ద రూపొందించిన గోపురం సెటింగ్

భీమవరం: భీమవరం డీఎన్నార్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో ఆవరణలో చైతన్యభారతి సంగీత నృత్య నాటక పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ నుంచి నిర్వహించే 17వ జాతీయ స్థాయినాటిక పోటీలకు సర్వం సిద్ధం చేశారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీల్లో ఉభయ తెలుగురాష్ట్రాలకు చెందిన నాటక సంఘాలు తొమ్మిది నాటకలను ప్రదర్శించనున్నాయి. నాటకోత్సవాలను గురువారం రాత్రి డీఎన్నార్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకట నర్సింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు, పాలకొల్లు మాజీ ఎమ్మెల్యే అల్లు సత్యనారాయణ, పంతం వేణు గోపాలకృష్ణ నెహ్రూ ప్రారంభిస్తారు. ప్రారంభ సభలో సినీ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణకు ఆత్మీయ చైతన్య పురస్కారం, రంగస్థల నటుడు, నాటక రచయిత పురాణం వెంకట రామ్ కుమార్‌లకు జవ్వాది రంగస్థల చైతన్య పురస్కారం

సినీ నిర్మాత తుమ్మలపల్లికి ఆత్మీయ చైతన్య పురస్కారం

, రంగస్థల నటుడు, దర్శకుడు జనాబ్ ఎస్ఎం బాషాకు మైనంపాటి రంగనాయకులు రంగస్థల చైతన్య పురస్కారాలతో సత్కరిస్తారు. నాటకోత్సవాల ముగింపు సందర్భంగా జూన్ 2న కందాళం ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వ్యవస్థాపకుడు అప్పాజోస్యుల సత్యనారాయణకు రాయప్రోలు రామచంద్రమూర్తి రంగస్థల చైతన్యపురస్కారం, రంగస్థల నటీమణి ఎం రత్నకుమారిని పెనుపోతుల శేషగిరి రావు రంగస్థల చైతన్యపురస్కారంతో సత్కరిస్తారు. నాటిక పోటీల వేదిక ఏర్పాట్లును చైతన్య భారతి సభ్యులు రాయప్రోలు శ్రీనివాసమూర్తి, భట్టిప్రోలు శ్రీనివాసరావు, పేరిచర్ల లక్ష్మణవర్మ, కత్రిడ్డి సత్యనారాయణ, అప్పారావు, బాషా తదితరులు పర్యవేక్షించారు.

నాలుగు రోజులు.. 9 నాటికలు

- 30వ తేదీన గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారి 'మూల్యం'
- 31న కళాంజలి హైదరాబాద్ వారి 'రైతేరాజు', అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి 'మనస్విని', ఉషోదయ కళానికేతన్ కత్రపాడు వారి 'విముక్తి'
- జూన్ 1న అభినయ ఆర్ట్స్ గుండూరు వారి 'ఇంద్రప్రస్థం', తెలుగు కళాసమితి విశాఖపట్నం వారి 'నిశ్శబ్దమా! నీ ఖరీదెంత', శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరు వారి 'కౌసల్యా! సుప్రజా, రామా',
- 2న చైతన్య కళాభారతి కరీంనగర్ వారి 'స్వప్నం రాల్చిన అమృతం', విటీ పీఎస్ కల్చరల్ అసోసియేషన్ ఇబ్రహీంపట్నం వారి 'ఎనిమి' సాంఘిక నాటికలను ప్రదర్శిస్తారు.

యువకుడి ఆత్మహత్య

వేంపాడు గ్రామంలో విషాదం

ద్వారకాతిరుమల: మహిళతో తీసుకున్న ఫొటోలు, వీడియోలను స్నేహితుడు బయట పెట్టడంతో అవమాన భారాన్ని భరించలేక కలుపుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ద్వారకాతిరుమల మండలం వేంపాడు గ్రామానికి చెందిన గురజాల అంజిబాబు (19) పదో తరగతి వరకు చదువుకున్నాడు. ఎనిమిది నెలల నుంచి మొక్కజొన్న సీడ్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. వేంపాడుకు చెందిన ఒక వివాహితతో సన్నిహితంగా ఉంటూ ఆమెతో ఏకాంతంగా గడుపుతున్న దృశ్యాలను అంజిబాబు తన సెల్ ఫోన్‌తో ఫొటోలు, వీడియోలు తీసుకున్నాడు. వేంపాడుకే చెందిన అతడి స్నేహితుడు పాము మధు ఇటీవల అంజిబాబు సెల్ ఫోన్‌లో ఉన్న ఫొటోలు, వీడియోలను తన ఫోన్‌లోకి షేర్ చేసుకున్నాడు. వాటిని గ్రామంలోని పలువురికి చూపినట్టు తెలుసుకున్న అంజిబాబు మధుని నిలదీశాడు. 'నువ్వు అవమానంతో చచ్చే వరకు ఈ ఫొటోలు, వీడియోలను అందరికీ చూపిస్తూనే ఉంటానని మధు బెదిరించడంతో మనస్తాపానికి గురైన అంజిబాబు ఈనెల 26 న సాయంత్రం కలుపు మందు తాగాడు. పొలంలో ఉన్న తన తండ్రి రాంబాబు వద్దకు వెళ్లి జరిగిన విషయం చెప్పి కుప్పకూలిపోయాడు. స్థానికుల సాయంతో రాంబాబు అంజిబాబును తొలుత భీమడోలులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఏలూరు ప్రభుత్వాస్పత్రికి, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో అంజిబాబు మంగళవారం రాత్రి మృతి చెందాడు. తండ్రి రాంబాబు ఇచ్చిన ఫిర్యాదుతో మధుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్టు ద్వారకాతిరుమల ఎస్సై జి. సతీష్ బుధవారం తెలిపారు. అంజిబాబు మృతితో వేంపాడు గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.


గురజాల అంజిబాబు

భయంతో వ్యక్తి ఆత్మహత్య

భీమడోలు: గొడవ పడిన వ్యక్తులు తనను ఏమైనా చేస్తారేమోనన్న భయంతో ఓ వ్యక్తి ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన భీమడోలు పంచాయతీ పరిధిలోని అర్జావారిగూడెంలో చోటు చేసుకుంది. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అర్జావారిగూడెంకు చెందిన వల్లూరి జయరాజు (55) అనే వ్యక్తి బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసుల వివరాలు ప్రకారం.. అర్జావారిగూడెంకు చెందిన వల్లూరి జయరాజుకు అదే ప్రాంతానికి చెందిన వ్యక్తులతో చిన్న చిన్న గొడవలున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 27వ తేదీ సోమవారం సాయంత్రం వారి మధ్య గ్రామంలో గొడవ జరిగింది. అది మనసులో పెట్టుకుని వారు ఏమైనా చేస్తారేమో అని భయపడి జయరాజు గ్రామ శివారున గల పొలాల వద్ద ఈనెల 28వ తేదీ మంగళవారం మధ్యాహ్నం ఎలుకల మందు మజ్జిగలో కలుపుకుని తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న జయరాజును ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ పరిస్థితి విషయమించి జయరాజు మృతి చెందాడు. జయరాజు కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

టైలర్‌పై పోక్సో కేసు

కైకలూరు: మామయ్య అంటూ అప్యాయంగా పిలిచే బాలికకు స్కూల్ యూనిఫాం కొలతలు తీస్తానంటూ టైలర్ అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన కైకలూరులో జరిగింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనపై కైకలూరు టౌన్ పోలీసులు బుధవారం పోక్సో కేసు నమోదు చేశారు. కై కలూరులోని ఓ ప్రైవేటు స్కూల్‌లో బాలిక ఆరో తరగతి చదువుతోంది. ఆమెను తన తల్లి ఈ నెల 20న తాగడానికి షోడా తీసుకురమ్మని పంపింది. అటుగా వెళుతుండగా బాలికను అడవి నాయుడు సెంటర్‌లో టైలర్ సుల్తాన్ (37) స్కూల్ డ్రస్ కుట్టడానికి కొలతలు తీసుకుంటానని చెప్పి తాకరాని ప్రదేశాల్లో చేతులతో తాకాడు. ఈ విషయాన్ని బాలిక తన తల్లికి చెప్పింది. సదరు టైలర్, బాలిక ఒకే సామాజికవర్గం కావడంతో పెద్దలు చేసిన రాజీ ప్రయత్నాలు విఫలమయ్యాయి. చివరకు తల్లి ఫిర్యాదుతో టౌన్ ఎస్సై ఎంఆర్‌కే రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

టైలర్‌ను కఠినంగా శిక్షించాలి

వాస్తవానికి టైలర్ సుల్తాన్ మహిళల డ్రస్తులు కుట్టడు. బాలిక తల్లి డ్రస్ కుట్టమని క్లాత్ ఇవ్వలేదు. టైలర్ కూతురు, బాధిత బాలిక ఒకే స్కూల్‌లో చదివే స్నేహితులు. గతంలోనూ సుల్తాన్ మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన టైలర్‌ను కఠినంగా శిక్షించాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు. బాలిక తండ్రి కరోనా సమయంలో మరణించాడు.


పట్టుబడిన సుల్తాన్‌తో సీఐ, ఎస్సైలు

నిందితుడుకి రిమాండ్

బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన టైలర్ మహమ్మద్ సుల్తాన్ బాషా(37)ను కై కలూరులో పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈ మేరకు టౌన్ సీఐ ఆకుల రఘు, ఎస్సై ఎంఆర్‌కే రాజులు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు స్పందించామన్నారు. నిందితుడు సుల్తాన్ బాషాను స్థానిక కోర్టులో హాజరుపరిచగా, న్యాయవాది 14 రోజులు రిమాండ్ విధించారని చెప్పారు. బాలికలు, మహిళలపై ఎవరైనా లైంగిక వేదింపులకు పాల్పడిన, అసభ్యకరంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

షిఫ్ట్ ఆపరేటర్ రాసలీలలు

జంగారెడ్డిగూడెం: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రాసలీలలు నిర్వహిస్తూ షిఫ్ట్ ఆపరేటర్ అడ్డంగా దొరికిపోయాడు. మద్యం సేవించి ఒక మహిళతో నగ్నంగా దొరికిపోయాడు. వినియోగదారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక పర్రెడ్డిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్ గంగు మహేష్ రెడ్డి మంగళవారం రాత్రి విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం తెల్లవారు జామున విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వినియోగదారులు సబ్‌స్టేషన్‌కు ఎన్ని సార్లు ఫోన్ చేసినా ఎత్తలేదు. దీంతో వినియోగదారులు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు చేరుకున్నారు. అప్పటికే మహేష్ రెడ్డి పూటుగా మద్యం సేవించి ఒక మహిళతో నగ్నంగా దొరికిపోయాడు. వినియోగదారులు ఈ విషయాన్ని విద్యుత్ ఏడీఈ యు.సుబ్బారావుకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆయన వచ్చి చూసే సరికి మహేష్‌రెడ్డి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు. దీనిపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయంలో అసాంఘిక కార్యకలాపాలేందని ప్రశ్నించారు. దీనిపై విద్యుత్ ఈఈ పి.రాధాకృష్ణ మాట్లాడుతూ మహేష్‌రెడ్డి ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడని, అతనిపై పోలీసు కేసు నమోదు చేశారని చెప్పారు. మహేష్ రెడ్డిని విధులు నుంచి శాశ్వతంగా తొలగించినట్టు ఈఈ రాధాకృష్ణ తెలిపారు.

సీపెట్ డిప్లమో కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ముసునూరు: సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీఐపీఈటీ) గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్టు జాయింట్ డైరెక్టర్ అండ్ హెడ్ సీహెచ్ శేఖర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని పదో తరగతి విద్యార్హత గల యువతకు మూడేళ్ల వ్యవధిగల డిప్లమో కోర్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. అర్హులు మే 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కోర్సులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించే ఫీజు రీ యింబర్స్‌మెంట్ వర్తిస్తుందని తెలిపారు. సీపెట్ అడ్మిషన్ టెస్ట్ (కాట్)ను జూన్ 9న నిర్వహిస్తారని, ర్యాంకుల ఆధారంగా 150 మందికి విజయవాడలోని భారత ప్రభుత్వ సంస్థ సీఐపీఈటీ కేంద్రంలో శిక్షణ ఇస్తారని చెప్పారు. శిక్షణ అనంతరం ప్లాస్టిక్ సంస్థల్లో ఉద్యోగావకాలు కల్పిస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు ప్రోగ్రామ్ ఆర్గనైజర్ సాకిరి రామకృష్ణను ఫోన్ నెంబర్ 93985 35697లో సంప్రదించాలని పేర్కొన్నారు.

సీహెచ్‌సీలో అరుదైన ఆపరేషన్

గిరిజనుడికి దవడ కింది భాగంలో ఉన్న కణితి తొలగింపు

బుట్టాయగూడెం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు అరుదైన ఆపరేషన్ చేశారు. ఒక గిరిజనుడికి దవడ కింది భాగంలో కణితితో బాధపడుతుండగా మంగళవారం సాయంత్రం ఆపరేషన్ ద్వారా దానిని తొలగించారు. డాక్టర్ ఎన్ హేమంత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బుట్టాయగూడెం మండలం చిన్నజీడిపూడి గ్రామానికి చెందిన చీమల రామారావు అనే గిరిజనుడుకుడి దవడ కింద కణితి ఏర్పడింది. విజయవాడ, ఏలూరు, తదితర పెద్ద ఆస్పత్రుల్లో చూపించగా వైద్యం కోసం సుమారు రూ.లక్ష ఖర్చు అవుతుందని చెప్పడంతో స్తోమత లేని రామారావు బాధను భరిస్తూ ఇంటి వద్దనే ఉండిపోయాడు. ఇటీవల బుట్టాయగూడెం ఆస్పత్రికి రాగా వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు ఆపరేషన్ చేయాలని చెప్పారు. శస్త్రచికిత్స నిపుణులు హేమంత్‌కుమార్ సుమారు రెండున్నర గంటలపాటు శ్రమించి కణితిని తొలగించారు. ఆపరేషన్ చేసినప్పటికీ తనకు తెలియలేదని ప్రస్తుతం తన ఆరోగ్య పరిస్థితి చాలా బాగుందని రామారావు తెలిపారు. బుట్టాయగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో అరుదైన ఆపరేషన్ చేసిన వైద్యులను పలువురు అభినందించారు. కాగా ఇప్పటివరకు తాను సుమారు 78 రకాల శస్త్రచికిత్సలు విజయవంతంగా చేసినట్టు డాక్టర్ హేమంత్‌కుమార్ తెలిపారు.


బుట్టాయగూడెం ఆస్పత్రిలో ఆపరేషన్ చేసి బయటకు తీసిన కణితి


కణితి ఆపరేషన్ చేయించుకున్న రామారావు

చిటిక వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

జిల్లా పశు సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ నెహ్రూ బాబు

ద్వారకాతిరుమల: చిటిక వ్యాధి పట్ల గొర్రెలు, మేకల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశు సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి.నెహ్రూ బాబు సూచించారు. మండలంలోని వేంపాడు గ్రామంలో బుధవారం గొర్రెలు, మేకలకు ఎంటీరో టాక్సీమియా (చిటిక వ్యాధి) నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నెహ్రూబాబు గొర్రెలు, మేకల పెంపకందారులకు పలు సూచనలు, సలహాలనిచ్చారు. తొలకరి కాలంలో గొర్రెలు, మేకలకు అధికంగా ఈ చిటిక వ్యాధి వ్యాపించే అవకాశం ఉందని, ఈ వ్యాధి సోకిన జీవాలు అతి తక్కువ సమయంలోనే మృత్యువాత పడతాయన్నారు. కావున సకాలంలో వాటికి టీకాలు వేయించాలని సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో పశువైద్య సిబ్బంది పర్యటించి, చిటిక వ్యాధి టీకాలు వేస్తున్నట్టు తెలిపారు. టీకాల కోసం స్థానిక పశువైద్యశాలల్లో సంప్రదించాలన్నారు. అనంతరం గొర్రెలు, మేకల పెంపకందారులకు మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ అంగర సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.


వేంపాడులో గొర్రెకు టీకా వేస్తున్న పశు సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ నెహ్రూబాబు

క్లుప్తంగా

క్షేత్ర పరిశీలనతో పూర్తి స్థాయి అవగాహన



కడియద్ద గ్రామంలో జరిగిన రైతు సదస్సు

తాడేపల్లిగూడెం రూరల్ : పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించడం ద్వారా పూర్తి స్థాయి అవగాహన వస్తుందని హార్టీకల్చర్ డీన్ డాక్టర్ ఏఎస్.పద్మావతమ్మ అన్నారు. బుధవారం మండలంలోని కడియద్ద గ్రామంలో ఆర్‌హెచ్‌డబ్ల్యుఈపీ విద్యార్థులచే రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతమ్మ మాట్లాడారు. ఉద్యాన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ 50 శాతం మంది పిల్లలు పట్టణ ప్రాంతాల నుంచి వచ్చి గ్రామాల్లోని పద్ధతులకు అలవాటు పడ్డారన్నారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలను తిలకించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ పి.అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



మునేశ్వరరావు బ్రెయిన్ ఆపరేషన్ నిమిత్తం నగదు సాయం అందజేస్తున్న ఈఈ వెంకటేశ్వరరావు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నవాబుపాలెం గ్రామానికి చెందిన గిద్దా నవీన్ వెంకట మునేశ్వరరావు బ్రెయిన్ ఆపరేషన్ నిమిత్తం 150మంది విద్యుత్ ఉద్యోగులు తమ ఉదారతను చాటుకున్నారు. బుధవారం సాయంత్రం బాలుని ఇంటికి వెళ్లి ఆపరేషన్‌కు రూ.82వేలను విద్యుత్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ఆకుల సతీష్, ట్రేడ్ యూనియన్ నాయకులు, అసోసియేషన్ నాయకులు, ఎలక్ట్రికల్ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు అభినందనలు



పెదతాడేపల్లి గురుకుల విద్యాలయంలో పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్ : మండలంలోని పెద తాడేపల్లిలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల పదో తరగతి ఫలితాల్లో విజయం సాధించి విద్యార్థులను బుధవారం స్కూలు ఆవరణలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్‌జోన్‌చైర్మన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో 82మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం తల్లిదండ్రులు, ప్రిన్సిపల్ బి.రాజారావును మురళీకృష్ణంరాజు సన్మానించారు. అలాగే శ్రేష్ఠ కార్యక్రమంలో సీట్లు సాధించిన విద్యార్థులను సత్కరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు

తాడేపల్లిగూడెం అర్బన్ : నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ వారి ఆదేశాల మేరకు తాడేపల్లిగూడెం పట్టణంలో ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని నిలిపివేసేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలోని వ్యాపారులు, ప్రజలు ప్లాస్టిక్ గ్లాసులు, ఒకసారి వినియోగించి పారేసే ప్లాస్టిక్ వస్తువులు, ప్లాస్టిక్ ఫుడ్ ప్యాకింగ్ బాక్సులు తదితర ప్లాస్టిక్ సామాగ్రిని నిషేదించినట్లు తెలిపారు. వీటి స్థానంలో గుడ్డ సంచులు, నారసంచులు, పేపర్ ప్లేట్లు, అరటిఆకులు, ఆకులతో చేసిన విస్తరాకులు, పట్టణంలోని దుకాణాల్లో విక్రయించాలని, ప్రజలు వీటినే వినియోగించాలని తెలిపారు. ప్లాస్టిక్ నిషేదాన్ని విస్మరించిన వారిపై కఠిన చర్యలు తీసకుంటామని జీఓ 79 అనుసరించి రూ.5000 నుంచి రూ.10వేలు జరిమానా విధించి, దుకాణంలోని వ్యాపార లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు.

సమాజసేవ ప్రతి ఒక్కరి బాధ్యత

ఉండి: సమాజ సేవను ప్రతీ ఒక్కరూ బాధ్యతగా భావించాలని లయన్స్‌క్లబ్ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. మంగళవారం రాత్రి ఉండి లయన్స్ క్లబ్ కల్యాణ మండపంలో గవర్నర్ అధికారికంగా పర్యటించారు. ఈ సందర్భంగా క్లబ్ చేపట్టిన సేవలను ఆయన కొనియాడారు. మరిన్ని కార్యక్రమాలు చేపట్టి సమాజానికి లయన్స్‌క్లబ్ తరఫున సేవలు అందించాలని సూచించారు.ఈ సందర్భంగా క్లబ్ ఉపాధ్యక్షుడు గాదిరాజు రంగరాజును ప్రత్యేకంగా సత్కారించారు.ఈ సందర్భంగా సాగి రాజు సాంబరాజు ఆర్థిక సహాయంతో పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు, విద్యార్థులకు విద్యాసామగ్రి, భవిత విద్యార్థులకు టిఫిన్ బాక్సులు, చెరుకువాడ పెదపేట విద్యార్థులకు స్టీలు కంచాలు గవర్నర్ చేతుల మీదుగా అందించారు.

కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్

- జూన్ 4న తేలనున్న అసెంబ్లీ ఎన్నికల ఫలితం
- భీమవరం విష్ణు కాలేజీలో కౌంటింగ్ కోసం పకడ్బందీ ఏర్పాట్లు
- నియోజకవర్గానికి సంబంధించి 14 టేబుళ్లు ఏర్పాటు
- 17 రౌండ్లలో తుది ఫలితం వెల్లడి



భీమవరం కౌంటింగ్ కేంద్రంలో జరుగుతున్న ఏర్పాట్లు

తణుకు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ మేరకు జూన్ 4వ తేదీన ఉదయం 8 నుంచి కౌంటింగ్ మొదలు కానుంది. ఈక్రమంలో జిల్లా ఎన్నికల అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. తణుకు నియోజకవర్గానికి సంబంధి భీమవరంలోని విష్ణు కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో టేబుళ్లు ఏర్పాటు చేశారు. బారికేడ్ల నిర్మాణం పూర్తయ్యింది. మిగతా ఏర్పాట్లు ఈ నెలాఖరులోపు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించుకున్నారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈ నెల 13న పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. ఈవీఎంలను భీమవరంలోని విష్ణు కళాశాల స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు. అక్కడే కౌంటింగ్ కేంద్రాలను కూడా ఏర్పాటు చేశారు. నరసాపురం పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని తణుకు అసెంబ్లీతోపాటు పాలకొల్లు, ఆచంట, నరసాపురం అసెంబ్లీ నియోజకవర్గాలకు ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాట్లు చేశారు. తణుకు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ కోసం మరో నాలుగు టేబుళ్లు ఏర్పాటు చేయనున్నారు. మొదట 8 నుంచి 8.30 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్లను, అనంతరం ఈవీఎంలలో ఓట్లను లెక్కిస్తారు. ఒక్కో టేబుల్‌కు కౌంటింగ్ సూపర్‌వైజర్ పాటు ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు, ఒక మైక్రోఅబ్జర్వర్ ఉంటారు. మొత్తంగా ఒక టేబులు నలుగురు ఉద్యోగులు ఉండి ఓట్ల లెక్కింపు చేపడతారు.

అత్తిలి మండలం నుంచి ప్రారంభం...

జూన్ 4న చేపట్టబోయే కౌంటింగ్ తణుకు నియోజకవర్గానికి సంబంధించి అత్తిలి మండలం తిరుపతిపురం నుంచి ప్రారంభం కానుంది. మొత్తం 14 టేబుళ్లలో 17 రౌండ్లలో ఫలితాలను వెల్లడిస్తారు. నియోజకవర్గంలోని చివరిగా ఇరగవరం మండలంలోని ఏలేటిపాడు, జి.ఖండ్రిక గ్రామాల్లోని ఓట్లు లెక్కింపుతో తణుకు విజేత ఖరారు అవుతారు. మరోవైపు కౌంటింగ్ సమయం దగ్గర పడుతుండడంతో ఏర్పాట్లపై అధికారులు వేగం పెంచారు. కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఏజెంట్ల నియామకానికి మే 30లోపు దరఖాస్తులు ఇవ్వాలని ఆదేశించారు. ఈ క్రమంలో పోటీలో ఉండే అభ్యర్థులు ఏజెంట్ల నియామకంపై దృష్టి సారించారు. కేసులు లేని వారిని వెతికే పనిలో ఉన్నారు. అదే సమయంలో నమ్మకస్తుడై ఉండాలని, పార్టీకి, అభ్యర్థికి విధేయుడుగా ఉండే వారిని నియమించాలనే చూస్తున్నారు.

నిరంతర పర్యవేక్షణ...

ఎన్నికలు ముగియగానే ఈవీఎంలను పోలింగ్ కేంద్రాల నుంచి అత్యంత భద్రత నడుమ జీపీఎస్‌తో అనుసంధానమైన వాహనాల్లో భీమవరం విష్ణు కళాశాలలో మూడంచెల భద్రత, సీసీ కెమెరాల నిఘా ఉన్న స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచారు. వీటిని ప్రతినిత్యం జిల్లా ఎన్నికల అధికారి, ఎస్పీ పర్యవేక్షణ చేస్తున్నారు. తుది పోలింగ్ వివరాల ప్రకారం తణుకు నియోజకవర్గంలో 82.09 శాతం ఓటింగ్ నమోదైంది. నియోజకవర్గంలోని మొత్తం 2,34,575 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,92,564 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. తణుకు అర్బన్ పరిధిలో 75,507 ఓటర్లకు గాను 57,307 మంది తహ ఓటు హక్కు వినియోగించుకోవడంతో పోలింగ్ శాతం 75.90 నమోదైంది. తణుకు మండలంలో 49,901 మంది ఓటర్లకు గాను 42,962 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 86.09 శాతం పోలింగ్ నమోదైంది. ఇరగవరం మండలంలో 53,029 మంది ఓటర్లకు గాను 44,781 మంది ఓటు హక్కు వినియోగిచుకోవడంతో పోలింగ్ శాతం 84.45 నమోదైంది. అత్తిలి మండలంలో 56,138 మంది ఓటర్లకు గాను 47,514 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 84.64 పోలింగ్ శాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మరో 2356 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించనున్నారు. ఇవి కాకుండా నియోజకవర్గంలోని 102 సర్వీసు ఓటర్లకు గాను ఇప్పటి వరకు 40 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి బీవీ రమణ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని హౌసింగ్‌బోర్డు సబ్ స్టేషన్ పరిధిలో రిలయన్స్ ఫీడర్, సత్యవతినగర్ ఫీడర్, నిట్ ఫీడర్‌లు మరమ్మతులు, ఆర్‌డీఎస్‌ఎస్ స్కీంలో భాగంగా విభజనలు (బైపరకేషన్) నిమిత్తం ఈ నెల 30వ తేదీ గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. విద్యుత్ ఉండని ప్రాంతాలు వివరాలు ఇలా ఉన్నాయి. హౌసింగ్ బోర్డు, గాంధీబొమ్మ సెంటర్, గణేష్‌నగర్, వానపల్లిగూడెం, మామిడితోట, వీకర్స్‌కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, సిపాయిపేట, గాయత్రిగుడి ఏరియాల్లో విద్యుత్ ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పదోతరగతి సప్లిమెంటరీ ఫిజికల్ సైన్స్ పరీక్ష ప్రశాంతం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి బుధవారం ఐదోవ రోజున ఫిజికల్ సైన్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని ఏడు స్కూల్స్ జెడ్పీ ఉన్నత పాఠశాల, కడకట్ల మునిసిపల్ హైస్కూల్, సుబ్బారావుపేట మునిసిపల్ హైస్కూల్, కింబర్లీ, మాంటిస్సోరి, సెంట్ జోన్స్, భాష్యం స్కూల్‌లో జరిగాయి. 1110 మంది విద్యార్థులకు గాను 598 మంది పరీక్షలకు హాజరయ్యారు. 512 మంది పరీక్షలకు హాజరుకాలేదు.

రుతుక్రమంపై కిశోర బాలికలకు అవగాహన



ఎర్రనీలిగుంట గ్రామంలో కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి



వేల్పూరులో అవగాహన కల్పిస్తున్న వైద్యులు, వైద్యసిబ్బంది

అత్తిలి : రుతుస్రావం సహజమైనదిగా భావించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి చెప్పారు. బుధవారం అత్తిలి మండలం వరిఘేడు శివారు ఎర్రనీలి గుంట గ్రామంలో రుతుక్రమ పరిశుభ్రతపై కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కిశోర బాలికలు నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూపర్‌వైజర్ శ్రీదేవి వివరించారు. అత్తిలి–4 సచివాలయం పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు రుతుపరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె మీనాకుమారి, వై శ్రీదేవి, జి సావిత్రి, జ లక్ష్మీకుమారి, మహిళా సంరక్షణ అధికారిణి వై సత్యశ్రీ. జె మౌనిక తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతతో అనారోగ్య సమస్యలు

తణుకు: రక్తహీనత అనారోగ్య సమస్యలను దారితీస్తోందని డాక్టర్ కేవీవీ కిశోర్, డాక్టర్ సాయి భవాని వివరించారు. తణుకు మండలం వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో బుధవారం రుతుపరిశుభ్రత దినోత్సవాన్ని నిర్వహించారు. కిషోర బాల బాలికలకు రుతు సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పరిశుభ్రతపై వివరించారు. కార్యక్రమంలో తణుకు ప్రాజెక్టు అధికారి ప్రమోదిని, సూపర్ వైజర్ కృష్ణకుమారి, వెంకటలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది ఉదయలక్ష్మి, కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎస్ఎంలు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో ఆలోచనా శక్తి



అత్తిలి శాఖా గ్రంథాలయంలో కాలుష్యంపై అవగాహన కల్పిస్తున్న రిసోర్సుపర్సన్



తాడేపల్లిగూడెం(టీటీసీ) శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

అత్తిలి: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు గణితం, జీకే అంశాలపై ఉపాధ్యాయుడు ఎ రామకృష్ణ శిక్షణ ఇచ్చారు. రిసోర్సుపర్సర్ కె కోమలి కాలుష్య నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నానాటికి పెరిగిపోతున్న కాలుష్యాన్ని అధిగమించాలంటే చెట్లే ప్రత్యామ్నాయమన్నారు. చెట్లను పెంచడం ద్వారా వాతావరణం ఆహ్లాదకరంగా మారుతుందన్నారు. ఈసందర్భంగా గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, గ్రామీణ గ్రంథపాలకులు ఆర్ దానకృష్ణ, హెచ్‌వీఆర్ కిశోర్‌బాబు, ఎం శ్రీదేవి, సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌పై అవగాహన

తణుకు టౌన్ : విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులలో భాగంగా తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో కే సత్యనారాయణ, వైఎస్ఎన్ వసంతరావు, బసవేశ్వరరావు, గ్రంథాలయ అధికారి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ) : విజ్ఞానం కోసం గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా సలహాదారులు ప్రత్తి వీరాస్వామి, రిసోర్స్‌పర్సన్స్ ఎస్.సత్యం, బాపయ్య శర్మ, వి.రామాంజనేయులు పేర్కొన్నారు. బుధవారం తాడేపల్లిగూడెం గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం సమ్మర్ క్లాసులు జరిగాయి. తొలుత విద్యార్థులకు పుస్తక పఠనం, నీతి కథలు, పంచతంత్ర కథలు, ఆటల పోటీలు, ఆధ్యాత్మిక విషయాలు, వివిధ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



తణుకు ఎన్టీఆర్ పార్కులో రంగులరాట్నం తిరుగుతున్న చిన్నారులు



తణుకు ఎన్టీఆర్ పార్కులో బోట్ షికారు ప్రాంతంలో సందడి చేస్తున్న చిన్నారులు, మహిళలు

సందడే.. సందడి

- తణుకులో కిక్కిరిసిన పార్కులు
- ఆటపాటలతో చిన్నారులు
- పిల్లల ఆనందాన్ని చూసి కేరింతలు కొడుతున్న తల్లిదండ్రులు

తణుకు అర్బన్: వేసవి సెలవుల సందర్భంగా చిన్నారులు వివిధ ఆటపాటల్లో మునిగిపోయారు. ఉదయం నుంచి వేడి వాతావరణంతో ఇంటికే పరిమితమవుతున్న పిల్లలు సాయంత్రం అయ్యిందంటే చాలు పార్కుల్లో ప్రత్యక్షమవుతున్నారు. వేసవి ఆటవిడుపుగా తల్లిదండ్రులు పిల్లలతో తమకు సమీపంలో ఉన్న పార్కుల్లో సేదతీరుతున్నారు. దీంతో తణుకు మునిసిపాలిటీలో ఉన్న పార్కులన్నీ కిక్కిరిసిపోతున్నాయి. పార్కులకు వెళ్లలేని చిన్నారులు తమ ఇంటి గుమ్మంలో వివిధ ఆటలు ఆడుకుంటూ ఉల్లాసంగా గడుపుతున్నారు.

తణుకులో 12 పార్కులు...

తణుకు మునిసిపాలిటీ పరిధిలోని 34 వార్డుల్లోకెల్లా అతి పెద్ద పార్కుగా ఉన్న ఎన్టీఆర్ పార్కుతోపాటు హౌసింగ్ బోర్డు కాలనీ వైఎస్సార్ పార్కులకు చిన్నారులు, తల్లి తండ్రులు అత్యధికంగా వస్తున్నారు. బ్యాంకు కాలనీ, ఎన్జీవోస్ కాలనీ తదితర ప్రాంతాలతో కలిపి మొత్తం 12 పార్కుల్లో వేసవి ప్రారంభం నుంచి జనసందడి అధికమైంది. రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పార్కులన్నిటిలోను వాకింగ్ ట్రాక్‌తోపాటు మినీ జిమ్ పరికరాలు కూడా రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో అందుబాటులోకి తీసుకురావడంతో పార్కులన్నీ ఆహ్లాదకరంగా మారాయి. మంచి గ్రీనరీ ఏర్పాటు చేయడంతో పార్కులకు ఆదరణ పెరిగింది. ముఖ్యంగా ఎన్టీఆర్, వైఎస్సార్, బ్యాంక్ కాలనీలో ఉన్న పార్కుల్లో చిన్నారులు రంగుల రాట్నాలు, ఊయలలు, జిమ్ పరికరాలతో ఆటలాడుతుండడంతో తల్లి తండ్రులు కూడా వారితోపాటు ఉత్సాహంగా గడుపుతున్నారు. వేసవి వడగాల్పులను సైతం లెక్కచేయకుండా వేసవి సెలవులను పిల్లలు ఎంజాయ్ చేస్తున్న తీరు సందడిగా మారింది.



తణుకు ఎన్టీఆర్ పార్కులో చిన్నారుల సందడి



తణుకు హౌసింగ్ బోర్డు కాలనీ వైఎస్సార్ పార్కులో చిన్నారులు, తల్లిదండ్రులు సందడి

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ



మధ్యాహ్న భోజనంపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కృష్ణారావు, ఎంఈఓ జ్యోతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): మధ్యాహ్న భోజనం పథకం అమలుపై, వాటి తయారీదారులకు పట్టణంలోని యాగర్లపల్లి ఎంజీఎం పాఠశాల ఆవరణలో బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి పీఎంకే జ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వ మెను ప్రకారం స్కూల్ పిల్లలకు రుచికరమైన భోజనం తయారు చేసి పిల్లలకు వడ్డించాలని చెప్పారు. సమగ్ర శిక్ష మధ్యాహ్న భోజనం కో ఆర్డినేటర్ కే.కృష్ణారావు వంట వారు తయారు చేసిన మెను భోజనం పరిశీలించి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ రుచికరమైన భోజనం తయారు చేసి, విద్యార్థులందరూ పాఠశాలలో భోజనం చేసే విధంగా పలు సూచనలు, సలహాలు అందజేశారు. మండల సీఆర్పీలు నానిబాబు, పుల్లారావు, ఏసుబాబు, చలం, చంద్రరావు, నగేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, భోజన పథకం నిర్వాహకులు, సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సమగ్రంగా పనులు కల్పించాలి



ఆరుళ్ళ గ్రామంలో నినాదాలు చేస్తున్న కూలీలు

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి పనులు ఆలస్యంగా ప్రారంభించి, వారంలోనే పనులు పూర్తయ్యాయని చెప్పడం సరికాదని, కూలీలకు సమగ్రంగా పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని నందమూరు, ఆరుళ్ళ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను సందర్శించారు. ఈ సందర్భంగా కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది ఎనిమిది రోజులు మాత్రమే పనులు కల్పించారని నందమూరు గ్రామానికి చెందిన పలువురు కూలీలు వారి దృష్టికి తెచ్చారు. దీనిపై సోమరాజు స్పందిస్తూ కూలీలకు సమగ్రంగా పనులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రొక్కం కనకమహాలక్ష్మి, గుండు జానయ్య, తాతారావు, కంభంపాటి శ్రీనివాస్, సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పారావు జీవితం స్ఫూర్తిదాయకం



అప్పారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తణుకు: స్వాతంత్ర్య సమరయోధులు, తొలితరం కమ్యూనిస్టు నాయకులు, రాష్ట్ర రైతు సంఘం నాయకులు సంకు అప్పారావు 32వ వర్థంతి కార్యక్రమాన్ని బుధవారం తణుకులో నిర్వహించారు. స్థానిక బ్యాంకు కాలనీలో అప్పారావు విగ్రహానికి పూలమాలలు వేసిన వామపక్ష పార్టీల నాయకులు, ప్రముఖులు ఘనంగా నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమం ఆ తర్వాతి నిర్బంధ కాలంలో పదేళ్లపాటు రహస్యజీవితం గడిపారని అన్నారు. మొక్కవోని ధైర్యంతో నిలబడిన అప్పారావు జీవితం స్ఫూర్తిదాయకమని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాన్సీ, సామాజి కన్యాయపోరాట సమితి రాష్ట్ర నాయకులు పేరూరి మురళీకుమార్, అప్పారావు కుమార్తె సంకు మనోరమ, డాక్టర్ రమేష్, బొద్దాని నాగరాజు, నీలం మాల్యాద్రి, గార ప్రసాద్, న్యాయవాదులు అంబేద్కర్, జి.సీతారామరాజు, కౌరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన



ప్రదర్శనలో పాల్గొన్న ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు

తాడేపల్లిగూడెం రూరల్: బాలికలు రుతుక్రమ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి అన్నారు. బుధవారం మండలంలోని నవాబుపాలెం నెం.137 అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు రుతుక్రమ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ బాలికలు నాప్‌కిన్‌లు వినియోగించాలని సూచించారు. రక్తహీనత లేకుండా తీసుకోవలసిన పౌష్టికాహారాల గురించి వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్త బిఎం.దేవి, ఆశా కార్యకర్తలు డి.దేవి, డిఎం.దేవి, కే.రమణ తదితరులు పాల్గొన్నారు.

నీలాద్రిపురంలో...:

రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా నీలాద్రిపురం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సీహెచ్‌వో విజయలక్ష్మి మాట్లాడుతూ బాలికలు రుతుక్రమ సమయంలో పరిశుభ్రత పాటించకపోతే ఇన్‌ఫెక్షన్లు వస్తాయన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ జి.బేబి, ఏఎన్ఎం సారమ్మ, బాలికలు పాల్గొన్నారు.